సమస్యలపై కమిషనర్‌కు కార్పొరేటర్లు వినతి

విశాలాంధ్ర-పెదగంట్యాడ : జీవీఎంసీ కమిషనర్‌గా నూతనముగా బాధ్యతలు తీసుకున్న కేతన్ గార్గ్‌ను 75వ వార్డు కార్పొరేటర్ మరియు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి ఈ రోజు ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియ చేశారు. ఈ సందర్భములో కార్పొరేటర్ గారు 75వ వార్డు ముఖ్య సమస్యలైన పెదగంట్యాడ శ్మశాన వాటిక పూర్తి స్థాయిలో త్వరితగతిగా పూర్తి చేయాలని, నెల్లి ముక్కు జీవీఎంసీ మైదానము అభివృద్ధికి అవసరం అయిన నిధులు కేటాయించాలని, వార్డులోని పెండింగ్ పనులను పూర్తి చేయాలని వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, దొమ్మేటి సోము నాయుడు, కాకినాడ అప్పలరాజు కమిషనర్‌ని అభినందించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంను జపాన్ దేశ జెట్రో సంస్థ ప్రతినిధులు సందర్శన

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ను నేడు జపాన్ దేశానికీ చెందిన జెట్రో (జపాన్ ఎక్స్టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) సంస్థ ప్రతినిధులు సందర్శించారు. ఈకార్యక్రమంలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపయుక్తంగా, విద్యార్థులకు లబ్ధిచేకూరే విధంగా వుండే నూతన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధంచేసుకునే దిశగా చర్చలు సాగించారు. ఈ సందర్భంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ జెట్రో (జపాన్ ఎక్స్టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) సంస్థ ప్రతినిధులకు ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో జెట్రో తోయమ చిప్ తమురా కెన్, సీనియర్ డైరెక్టర్ జుంకి యమాషిట,డైరెక్టర్ జనరల్ కావోరు శిరయిషి, అసిస్టెంట్ డైరెక్టర్ వీర బాబు వీర్ల మరియు డీన్ బెట్రీచ్ ఆచార్య కె.రమాసుధా, రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెట్రో (జపాన్ ఎక్స్టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) సంస్థ ప్రతినిధులు నాస్కామ్ సెంటర్‌ను, డీన్ బెట్రీచ్ విభాగాలను సందర్శించారు.

జూన్ 27న ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేలా

విశాలాంధ్ర-పెందుర్తి : పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో జూన్ 27 న మెగా జాబ్ మేళా జరుగుతుందని అర్హులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ ఈ ఫ్లోరా తెలియజేశారు. ఆరోజు ఉదయం 9.00 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసి, ఎస్బిఐ కార్డ్స్ , జయభేరి ఆటోమోటివ్స్, హెట్రో, మెడ్ ప్లస్, డెక్కన్ కెమికల్స్, నవతా రోడ్ ట్రాన్స్పోర్ట్, నిటాంబిట్, అంకార్ట్ టెక్నాలజీస్, లక్ష్మీ హుందాయ్, 20- 50 హెల్త్ కేర్, జస్ట్ డేల్, సుస్వదీప్, మదర్సన్. మొదలగు 14 కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాలకు ఇంటర్వ్యూస్ కండక్ట్ చేస్తారని చెప్పారు. ఈ ఇంటర్వ్యూలకు బిఎస్సీ, బీసీఏ, బీకాం, బీబీఏ, బిఏ, బీటెక్, ఎంసీఏ, డిప్లమా, ఐటిఐ, ఇంటర్, టెన్త్ ఉత్తీర్ణత అర్హత కలిగిన వారు అర్హులని జీతం ఏడాదికి 1.5 లక్షల నుండి 3.3లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు ఏపీ, తెలంగాణ చెన్నైలలో పనిచేయాల్సి ఉంటుందని మొత్తం 1430 వేకెన్సీస్ ఉన్నాయని చెప్పారు. 30 సంవత్సరాల లోపు వయసు గల ఏ కళాశాలలేనైనా డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువత స్త్రీలు పురుషులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునని తెలియజేశారు. జాబ్ మేళాకు రెస్యూమ్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ ఫొటోస్, సర్టిఫికెట్, మార్క్స్ లిస్ట్ తీసుకుని స్థానిక ఆదర్శ్ కళాశాల డీజీ సెమినార్ హాల్లో హాజరు కావాలని కళాశాల సెక్రటరీ టి థియోఫిలాస్ సూచించారు. ఈ సువర్ణ అవకాశాన్ని యువత వినియోగించు కోవాలని, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన తెలియజేశారు.

ఆచార్య కె యస్.చలంకు తమిళనాడు వి.సి.కె.అంబేద్కర్ అవార్డు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : తమిళ నాడు వీసీకే డాక్టర్ అంబేద్కర్ అవార్డును ఆచార్య కె యస్ చలం ప్రదానం చేశారు. ప్రతి సంవత్సరం డాక్టర్ అంబేద్కర్, పెరియార్ పేరు మీదుగా యిచ్చే ప్రతిష్టాత్మక అంబేద్కర్ అవార్డును యీ ఏడాది ఆచార్య కే ఎస్ చలంకు అందజేశారు. ఆచార్య చలం ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి జాతీయ స్థాయి రాజ్యాంగ పదవి పొందిన మొదటి ఆచార్యులు . (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా) అధ్యాపకులుగా ఏయు నుంచి మొట్టమొదటిసారిగా ఉన్నత పదవి పొందారు. ద్రావిడ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా సేవలందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శత జయంతి జరుపుకుంటున్న సందర్భంగా ఈ అవార్డ్ రావటం విశ్వవిద్యాలయానికి, విశాఖ నగరానికి గౌరవం. దేవనూర్ మహాదేవ కు పెరియార్ అవార్డు అందుకున్నారు. దేవనూరు మహాదేవ ప్రముఖ కన్నడ రచయిత. గతంలో విసికె అంబేద్కర్ అవార్డు ను తమిళ నాడు ముఖ్యమంత్రి కరుణానిధి, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కు ప్రధానం చేసారు. ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ కూడా ఈ అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది ఆచార్య చలం కు అంబేద్కర్ అవార్డు, కట్టప్ప సత్యరాజ్‌కు దేవనూర్ ,మహదేవ కు పెరియార్ అవార్డు అందుకున్నారు. కాగా అంబేద్కర్ అవార్డు ప్రముఖమైనది. తమిళనాడు లోని చెన్నై లోని అట్టహాసంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.అడుగడుగునా అతిథులు, అవార్డు గ్రహీతల కటౌట్లు ఏర్పాటు చేసి ఆహ్వానం పలికారు.

ప్రమాదాలకు నిలయం రేవల్లపాలెం రహదారి

విశాలాంధ్ర-పీఎం పాలెం : జీవీఎంసీ పరిధిలో ఆరో వార్డు రేవళ్లపాలెం రహదారి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిపోతుంది. జీవీఎంసీ అధికారులు శివారు ప్రాంతాల అభివృద్ధిపై శ్రద్ధ చూపకపోవడంతో ఈ రహదారులన్నీ గోతులమయంతో నిత్యం ప్రమాదాలకు కేంద్రాలుగా మారాయి. మధురవాడ బ్రిడ్జి నుండి బక్కన్నపాలెం, రేపల్లె పాలెం, నవోదయ వెళ్లే రహదారి తీవ్రగోతులతో ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ఆ రహదారులపై ప్రయాణించే ప్రజలు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు రహదారుల నిర్మాణం చేపట్టడంలో శ్రద్ధ చూపడం లేదని, స్థానిక వార్డు కార్పొరేటర్ కూడా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు శివారు ప్రాంతాల్లో రహదారులు నిర్మాణాలు , కాలువలు వీధి దీపాలు నిర్వహణ వంటి మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, వేళల్లో ఇంటి పనులు చెల్లిస్తున్న నగర ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో జీవీఎంసీ అధికారులు ఇకనైనా శ్రద్ధ చూపాలని వారంతా వేడుకుంటున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతం చెరువులు తలపిస్తున్నాయి. ఈ రహదారు గుండా వెళ్లే అనేకమంది నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారుల నిర్మాణం చేపడతామని హామీ ఇచనప్పటికీ , మధురవాడ ప్రాంతంలో అనేక శివారు కాలనీలో రోడ్ల నిర్మాణం జరగకపోవడంతో పెద్దపెద్ద గోతులు ఉండడంతో వర్షాలు కురవడంతో మరింత పెద్ద ఎత్తున ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి.

భక్తులతో కిక్కిరిసిన భైరవాలయం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి క్షేత్ర పాలకుడు భైరవ స్వామివారి ఆలయం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులతో కిటకిటలాడింది. భైరవ స్వామివారికి నువ్వుల నూనె దీపం వెలిగించడం ఆచారం. స్థానికంగా ఉన్న భక్తులు కాకుండా అధికంగా నగరం, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నలుమూలల నుండి భక్తులు వచ్చి ఇక్కడ భైరవ స్వామివారికి తైలాభిషేకం, పంచామృత అభిషేకాలు చేసి చివరగా కొబ్బరి నీళ్లతో అభిషేకించి పూలతో అలంకరించి, దూపదీప నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లిస్తారు. భక్తులకున్న మానసిక, ఇతి, ఆర్థిక, రాజయోగం కావాలన్న, ఎన్నికల్లో నెగ్గాలంటే, శత్రు, నరఘోష , పీడకలలు, ప్రమాదాలు మొదలైన బాధలన్నీ తొలగు తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తుల రద్దీని ముందుగానే ఊహించి ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నత అధికారులు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైం పోలీస్ అధికారులను, సిబ్బందిని బందోబస్తు వేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తనదైన శైలిలో ఏర్పాట్లు చేశారు.

కాంట్రాక్టు సిబ్బందికి ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-మల్కాపురం : అర్హత కలిగిన, ఆసక్తిగల అభ్యర్థులు 2025-26 విద్యా సంవత్సరానికి కాంట్రాక్టు సిబ్బంది రిజర్వ్ ప్యానెల్ తయారీ కోసం స్థానిక నౌసనాబాద్ కె.వి.1 పాఠశాలలో నిర్వహించబోయే ఇంటర్వ్యూకు రావాలని దేవి పాఠశాల ప్రిన్సిపల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 27న రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఉదయం 8:30 నుండి 9:30 వరకు ఇంటర్వ్యూ ఉదయం 10:00 గంటల నుండి ప్రారంభమవుతుంది. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోస్టులు: టీజీటీ (ఇంగ్లీష్, సంస్కృతం, సోషల్ స్టడీస్, ఆర్ట్).

విశాఖ జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా న్యాయమూర్తి చిన్నమశెట్టి రాజును మర్యాద పూర్వకంగా బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విశాఖపట్నం జిల్లా న్యాయమూర్తి కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా మహా విశాఖ నగర పాలక సంస్థకు సంబంధించి న్యాయపరమైన అంశాలను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తి ని కమిషనర్ కోరారు.

జీవీఎంసీ కమీషనర్ కేతన్ గార్గ్‌తో జియ్యాని శ్రీధర్ భేటీ

విశాలాంధ్ర-గోపాలపట్నం : మహ విశాఖ నగరపాలక సంస్థ నూతన కమీషనర్ కేతన్ గార్గ్ ఐఏఎస్ ను విశాఖ నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ మేరకు బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శ్రీధర్ కమిషనర్‌ని కలిసి పాఠ్యపుస్తకాలను ఆయనకు బహుకరించారు. అనంతరం ఆయనతో పలు ప్రధాన సమస్యలపై చర్చించారు. నగరాభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు శ్రీధర్ తెలిపారు. 52వ వార్డులో పార్క్ లు, గ్రీన్ బెల్ట్‌లు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల మంజూరు విషయమై ఆయనకు వినతీపత్రం అందజేశారు సానుకూలంగా స్పందించిన జీవీఎంసి కమిషనర్ వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారని శ్రీధర్ తెలిపారు.

ఘనంగా ఎన్ని జన్మదిన వేడుకలు

రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రకార్యదర్శి

విశాలాంధ్ర -అనందపురం ఎన్ని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ఆనందపురం మండలంలో బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీకాకుళం జిల్లా జనసేన అధ్యక్షులు ,తూర్పు కాపు రాష్ట్ర అధ్యక్షులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి పిసిని.చంద్రమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ ను ఘనంగా ఎన్ని శ్రీనివాసరావు స్థానిక నాయకులు ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం నాయకులు, అనంద పురం మండల నాయకులు పలువురు పాల్గొన్నారు.

అనకాపల్లి నీటి సరఫరా పైప్ లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : అనకాపల్లి జోన్ లో చేపట్టిన ప్రధాన నీటి సరఫరా పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీటి సరఫరాను సకాలంలో సంతృప్తి స్థాయిలో అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన అనకాపల్లి జోన్, తుంపాల గ్రామంలో జీవీఎంసీ నీటి సరఫరా హెడ్ వాటర్ వర్క్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న అనకాపల్లి ప్రధాన నీటి సరఫరా పైపులైన్ పనులు పై సమీక్షించి, ఇప్పటికే పనులు చాలా ఆలస్యం అయ్యాయని, ఆయా పైప్ లైన్ పనులు సెప్టెంబర్ 2025 నాటికి పూర్తి అయ్యేలా గుత్తేదారులను ఆదేశించి తగిన చర్యలు చేపట్టాలని జీవీఎంసీ నీటి సరఫరా పర్యవేక్షక ఇంజనీరు కె.వి.ఎన్ రవిని ఆదేశించారు.నీటి సరఫరా క్లోరిన్‌ను పరిశీలించారు. నేటి సరఫరా సమయంలో నీటి నాణ్యతలో టర్బిడిటీ స్థాయిలను క్రమం తప్పకుండా పరిశీలించాలన్నారు. హెడ్ వాటర్ వర్క్స్ లో ఎంతమంది ఉద్యోగులు, అధికారులు విధులు నిర్వహిస్తున్నారని ఆరా తీసారు. తాగునీటి సరఫరా లో నిత్యం ప్రజలకు అందించే తాగునీటి నాణ్యతా పరీక్షలు ఏ సమయంలో చేపడుతున్నారని వార్డు ఎమినిటీస్ కార్యదర్శులను ఆరా తీస్తూ, వార్డులలో పర్యటిస్తూ నిత్యం ఉదయం సమయంలో ప్రజలకు అందిస్తున్న తాగునీరు నాణ్యత పరీక్షలు జరపాలని,రాత్రి సమయంలో వీధి దీపాలను పరిశీలించి అన్ని వీధిలోను వీధి దీపాలు వార్డు ఎమినిటీస్ కార్యదర్శులు విధులు నిర్వహించేలా తగిన చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీర్ కు కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమీషనరు బి.వి.రమణ, కార్యనిర్వాహక ఇంజనీరులు ఏడుకొండలు, శేఖర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు గోపాలక్రిష్ణ, వార్డు ఎమినిటీస్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-విశాఖ : ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని, భవిష్యత్తు అవసరాలను, ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని పాత వాటిని నవీకరించాలని జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్.డి.ఎం.ఎ.) ప్రతినిధులు నావల్ ప్రకాశ్, అభిషేక్ బిశ్వాస్, అభినవ్ వాలియా పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితుల అధ్యయనం కొరకు, అధికారులతో సంప్రదింపులు చేసేందుకు బుధవారం జిల్లాకు విచ్చేసిన వారు ముందుగా జిల్లా కలెక్టర్ ను తన ఛాంబర్లో మర్యాద పూర్వకంగా కలిశారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా సమగ్ర ప్రణాళికలు, విపత్తుల నిర్వహణలో అంతర్ జిల్లాల సహకారం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కలెక్టరేట్ మీటింగు హాలులో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విపత్తుల నిర్వహణలో జపాన్ అనుసరించిన సాండియా ఫ్రేమ్ వర్క్, ప్రధానమంత్రి రూపొందించిన పది సూత్రాల అజెండా, డిజాస్టర్ రిస్క్ మేనేజ్మెంట్ లో అనుసరించాల్సిన విధానాలపై సమీక్షించారు. ఈ క్రమంలో ఎన్.డి.ఎం.ఎ. రూపొందించిన పీపీటీని ప్రజెంట్ చేశారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ రూపొందించిన నిబంధనలను సూక్ష్మంగా వివరించారు. ఈ సందర్భంగా జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాశ్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా ప్రణాళికలను ఆధునికీకరించా లని సూచించారు. విపత్తుల నిర్వహణలో సాచేత్ యాప్, ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్, డ్రోన్ వ్యవస్థలను వినియోగించుకోవాలని చెప్పారు. ప్రమాదాలు సంభవించినప్పుడు అంతర్ జిల్లాలు పరస్పర సహకరించుకోవాలని హితవు పలికారు. ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్డీఆర్ఎఫ్, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను సందర్శించాలని, భవిష్యత్తు కార్యాచరణ, ప్రణాళికలు తయారు చేసుకోవాలని పేర్కొన్నారుస. ప్రకృతి విపత్తులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, విరివిగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని సూచించారు. వినూత్న రీతిలో మాస్ క్యాంపెయిన్ కార్యక్రమాలను చేపట్టాలని, ప్రధాన మంత్రి రూపొందించిన పది సూత్రాలపై అవగాహన కల్పించాలని, వాటిని ప్రతి కార్యాలయం నోటీస్ బోర్డులో ఉంచాలన్నారు. అలాగే ప్రతి కార్యాలయం వద్ద ప్రాథమిక ఎమెర్జెన్సీ కిట్ ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సాచేత్ యాప్ ను వినియోగించటం ద్వారా ప్రమాద హెచ్చరికలను మెసేజ్ల రూపంలో పొందవచ్చున్నారు. పరిశ్రమలు, కొత్త ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చే సమయంలో అన్ని రకాల నిబంధనలు పాటించాలని, లేనట్లయితే భవిష్యత్తులో విపత్తులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో ఉండే ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్డీఆర్ఎఫ్ బెటాలియన్ల సంఖ్యను పెంచుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. దేశంలోనే మొదటగా జాతీయ సైక్లోన్ మిటిగేషన్ కేంద్రాన్ని ఒడిశా, ఆంధ్రప్రదేశ్ లలో నెలకొల్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విశాఖ లాంటి ప్రాంతంలో అన్నిరకాల విపత్తులు సంభవించడానికి ఆస్కారం ఉందికావున, అన్ని రకాలుగా ప్రణాళికులు రూపొందించుకొని సన్నద్ధంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎస్.డి.ఎం.ఎ. ప్రతినిధి సీహెచ్ పీటర్, డీపీఎం రాము, సివిల్ డిఫెన్స్ అధికారి మధుసూదన్ రావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్.ఎఫ్. ప్రతినిధులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ రాజకీయ ఉన్మాది

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

విశాలాంధ్ర-పెందుర్తి : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయ ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారని జనసేన విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రౌడీయిజం రాజ్యమేలేలా గత ఐదు సంవత్సరాలు పరిపాలించిన జగన్ మోహన్ రెడ్డి దారుణంగా ఓడిపోయినా ఇంకా పశ్చాత్తాపం లేదని అదే ఉన్మాదాన్ని ఇంకా ప్రదర్శిస్తూ జనాలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. అధికారంలోనూ, ప్రతిపక్షంలోనూ ఇటువంటి నేరస్తులు ఉండకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాలంటే ఆదర్శంగా ఉండాలని, పదిమంది మనల్ని చూస్తుంటారన్న విజ్ఞతతో వ్యవహరించాలని ఉద్బోధించారు. బెట్టింగ్లో సంవత్సరం కిందట ప్రాణాలు పోయిన వ్యక్తికి నివాళులర్పించడమే దారుణమైతే దానిని బల ప్రదర్శనకు ఉపయోగించడం మరింత కిరాతకమన్నారు. తన కారు కింద సింగయ్య అనే వైసీపీ కార్యకర్త పడినా, కనికరం లేకుండా మనిషి ప్రాణాన్ని లెక్కచేయకుండా వెళ్లిపోవడం జగన్మోహన్ రెడ్డి దురాహంకారానికి నిదర్శనం గా నిలుస్తుందన్నారు. గాయపడిన వ్యక్తిని ముళ్లపొదల్లోకి ఈడ్చివేయడం జేజేలు కొట్టించుకోవడం దారుణం, ఎలక్షన్ కారణంగా ఇద్దరు చనిపోతే కనీసం సంతాపం వ్యక్తం చేయని జగన్, బెట్టింగ్ బ్లేడ్ బ్యాచ్ లు కోసం పశ్చాత్తాప యాత్రలు చేయడమ జగన్ రాజకీయ క్రూరత్వం, స్వార్థానికి ప్రతీకలని దుయ్యబట్టారు. సొంత బాబాయి హత్యను కూడా అధికార దాహం కోసం ఉపయోగించుకున్నారని, సమాజంలో హింసను, అరాచకాన్ని ప్రోత్సహించే ప్రతి ఒక్కడు నేరస్తుడేనని ఎమ్మెల్యే పంచకర్ల స్పష్టం చేశారు. నేరస్థుడు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్రానికి, ప్రజలకు ప్రమాదమేనన్నారు. మాజీ సీఎం రఫా రఫా నరికేస్తామన్న మాటల్ను సమర్థిస్తూ రాక్షస ఆనందం పొందుతుంటే ప్రజలందరూ ఆందోళనకు గురి అవుతున్నారని పేర్కొన్నారు.

పెదగాడి జనచైతన్య లే అవుట్ ప్లాట్లకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర-పెందుర్తి : పెందుర్తి మండలం, పెదగాడి గ్రామంలోని జనచైతన్య లేఅవుట్ లో కొనుగోలు చేసుకున్న తమ ప్లాట్లకు రక్షణ కల్పించాలని అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉదయం లేఅవుట్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు అహ్మద్, కార్యదర్శి రంగనాయకులు, ఉపాధ్యక్షుడు ప్రసాద్ సహా సుమారు 50 మంది ప్లాట్ల యజమానులు మాట్లాడుతూ జన చైతన్య నుండి పూర్తి హక్కులతో 1995లో తాము కొనుగోలు చేసుకుని ప్లాట్లకు రక్షణ కూడా ఏర్పాటు చేసుకోగా గ్రామానికి చెందిన గళ్ళ అప్పలనాయుడు గళ్ళ అప్పారావు నీటిపల్లి మహేష్ తదితరులు వాటిని కూలగోట్టి దౌర్జన్యం చేస్తున్నారని విమర్శించారు. అడిగిన వారిపై దాడి చేసి గాయపరిచారని వాపోయారు. తమకు అనుకూలంగా మాట్లాడిన సర్పంచ్ భర్త త్రినాథ్ పైనా వారు దాడులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు స్పందించి తమ ప్లాట్లకు తమకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

జీవీఎంసీ నూతన కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ ముమ్మన

విశాలాంధ్ర - పెందుర్తి : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేతన్ గార్గ్‌ను పెందుర్తి బిజెపి నాయకులు, జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. బుధవారం ఉదయం కమిషనర్ చాంబర్లో కలిసి పుష్పకు సంబంధించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా 95వ వార్డు అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ కు కార్పొరేటర్ ముమ్మన దేముడు విజ్ఞప్తి చేశారు.

21వ వార్డులో జీవీఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ప్రజా ఆరోగ్యపు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన 3వ జోన్ 21వ వార్డు చిన్న వాల్తేరు లోని మసీదు వీధి, విజయనగర్ కాలనీ, నేతాజీ నగర్, కొయ్య వీధి, చిన్న వాల్తేర్ అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రత కాలువలోని వ్యర్థాల తొలగింపు మొదలైనవి ప్రతిరోజు విధిగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 21వ వార్డులో పలుచోట్ల కాలువలలో పారుతున్న మురుగునీటిని పరిశీలించి నిత్యం కాలువలు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. వార్డులోని ఉన్న పుష్కార్లను పరిశీలించి వాటిని అన్నిచోట్ల వినియోగించేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్‌ను ఆదేశించారు. కొయ్య వీధిలోని ప్రధాన కాలువలోని జరుగుతున్న పూడిక తీత పనులను పరిశీలించి వర్షాకాలంలో గెడ్డలు పొంగిపొరలకుండా కాలువలోని వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్‌కుమార్‌కు కమిషనర్ ఆదేశించారు. మసీద్ వీధిలోని కాలువలు, రోడ్లు పై భవన నిర్మాణ వ్యర్థాలను గమనించి వాటిని యుద్ధ ప్రాతిపదికపై తొలగించి వాటి ఫోటోలను అప్లోడ్ చేయాలని ప్లానింగ్ కార్యదర్శిని ఆదేశించారు. కొత్తగా భవనాలు నిర్మిస్తున్న భవన నిర్మాణదారులు వారి భవనాలు పూర్తి అయ్యేవరకు ఆయా భవన నిర్మాణాలను పూర్తిగా కప్పి ఉంచాలని, అలాగే భవన నిర్మాణ సామాగ్రిని రోడ్లపై వేయకుండా భవనాల కాంపౌండ్ వాల్ లోపల వేసేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. వీధులలో తాగునీరు సమస్య పైన వీధి దీపాల నిర్వహణ పైన స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో సోలార్ వీధిలైట్లతో సహా మొత్తం 331 వీధిలైట్లు ఉన్నాయని వాటిలో 16 వీధిలైట్లు వెలగడం లేదని వార్డు ఇమ్యూనిటీ కార్యదర్శి కమిషనర్‌కి వివరించగా అన్ని వీధిలైట్లు వెలిగేలా నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరించాలన్నారు. దుకాణాల ముందు ఉన్న డస్ట్ బిన్లను పరిశీలించి ప్రతి దుకాణం దుకాణాలతో తప్పనిసరిగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని రోడ్లను, ఫుట్ పాతులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించరాదని వ్యాపారస్తులను ఆదేశించారు. వార్డులోని ఎన్ని నివాసాలకు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ కలిగి ఉందని ఎమినిటీ కార్యదర్శులను అడిగి తెలుసుకుని శత శాతం అన్ని నివాసాలకు భూగర్భమైనది వ్యవస్థ కలిగి ఉండాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు.రోడ్డుపై ఉన్న మ్యాన్ హెూల్స్ లో వ్యర్థాలు పడకుండా జాలీలను అమర్చాలన్నారు. అనంతరం చిన్న వాల్తేరు లోని మెంటల్ హాస్పిటల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ పరిశీలించి ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లో పరిశుభ్రతతో పాటు వేడివేడిగా ఆహారాలను అందించాలన్నారు. రోజుకు ఎంతమంది అన్నా క్యాంటీన్‌ను వినియోగించుకుంటున్నారని నిర్వాహకులను ఆరా తీశారు. వాష్ బేసిన్లు, టాయిలెట్లు, పరిసరాల పరిశుభ్రత,టోకెన్ సిస్టం, వడ్డింపులను స్వయంగా పరిశీలించి అన్న క్యాంటీన్లోని విధులు నిర్వహిస్తున్న వారికి సకాలంలో జీతాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నిత్యం వేడి ఆహార పదార్థాలను ప్రజలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్, ఏఎమ్ఓహెచ్ బి.ప్రసాద్‌రావు, కార్యనిర్వహక ఇంజనీరు గంగాధర్, సుధాకర్, పద్మావతి, ఉప కార్య నిర్వహక ఇంజనీరు వెల్సన్, ఏపీడి రాము, శానిటరీ ఇన్స్పెక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనుల నిమిత్తం హెచ్పీసీఎల్ రూ.8.75 కోట్ల విరాళం

- పశ్చిమ ఎమ్మెల్యే, విప్ గణబాబు ప్రత్యేక చొరవతో ముందుకొచ్చిన అధికారులు
- జిల్లా కలెక్టర్ హారేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సమక్షంలో ఒప్పందాలు

విశాలాంధ్ర-విశాఖపట్టణం : జిల్లాలోని పలు అభివృద్ధి పనులు, అగ్నిమాపక వాహనాల కొనుగోలు నిమిత్తం హెచ్.పి.సి.ఎల్. సంస్థ జిల్లా యంత్రాంగానికి రూ.8.75 కోట్ల విరాళం ప్రకటించింది. ఈమేరకు పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు సమక్షంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జీవీఎఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌లతో సదరు సంస్థ ప్రతినిధులు కలెక్టర్ ఛాంబర్లో బుధవారం సాయంత్రం ఒప్పందాలు కుదుర్చుకున్నారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని గుల్లలపాలెం, రామ నగర్ లలో డ్రెయిన్లు నిర్మించేందుకు జీవీఎంసీకి రూ.8 కోట్లు అందించింది. అలాగే ఆధునిక సదుపాయాలు కలిగిన మూడు మిస్ట్ అగ్నిమాపక యంత్రాలను కొనుగోలు చేసుందుకు గాను జిల్లా యంత్రాంగానికి రూ.75 లక్షల ఆర్థిక సాయం అందజేసింది. సంబంధిత పత్రాలను మార్చుకున్న అధికారులు, వాటిపై సంతకాలు చేశారు. జిల్లా అభివృద్ధికి ముందుకొచ్చిన హెచ్.పి.సి.ఎల్. సంస్థ ప్రతినిధులకు విప్ గణబాబు, కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ధన్యావాదాలు తెలిపారు. ఎంఓయూల కార్యక్రమంలో హెచ్.ఆర్. సీజీఎం జి. కిరణ్‌కుమార్, ఈడీ రామనాథన్ రామకృష్ణన్, పీఆర్వో కాళీ నర్సింహం పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన కాంట్రాక్టర్లు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేతన్ గార్గ్‌ను జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కొత్త కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. అదే విధంగా తామెదుర్కొంటున్న సమస్యల్ని కూడా ఆయన వద్ద కాంట్రాక్టర్లు ప్రస్తావించారు. ఏడాది కాలంగా ఉన్న పెండింగ్ బిల్లుల విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్డీఎఫ్, జీవీఎంపీ-15 ఫైనల్స్‌పైనా మాట్లాడారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షులు పీవీపీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గుర్రం సింహాచలం, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్, జాయింట్ సెక్రెటరీ బూటు కృష్ణ, కె.అప్పలనాయుడు, కోశాధికారి శ్రీనివాసరావు, జాయింట్ ట్రెజరర్ ఎం.రవికుమార్, కార్యవర్గ సభ్యులున్నారు.

కూటమి ప్రభుత్వం విద్య పట్ల నిర్లక్ష్యం

- చంద్రబాబు ప్రభుత్వం తీసుకు వస్తున్న విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్నాను
- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

విశాలాంధ్ర-విశాఖ సిటీ : కూటమి ప్రభుత్వం విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని, పాఠశాలల సంఖ్యను తగ్గిస్తూ వస్తోందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. బుధవారం వి జె ఎఫ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య చాలా ప్రధానమైనదని, రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ఆంధ్ర ప్రదేశ్ లోనే కాదు, భారతదేశమంతా, ప్రతి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఏపీలో 35 వేల ప్రాథమిక పాఠశాలలను కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేశామని, చంద్రబాబు ప్రభుత్వం పాఠశాలల సంఖ్యను 10 లకు కుదించాలని ఆలోచన చేస్తుందని విమర్శించారు. ఇంకా తేదాది 5 వేల పాఠశాలను మూసేసారని, ఈ ఏదాది మరో 5000 పాఠశాలలను తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. పాఠశాలల సంఖ్యను తగ్గించే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తీసుకు వస్తున్న విద్యా విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు, మైనారిటీలు చదువుకోవడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వ పాలనలో పోలీసులు చంపడం తప్ప, మిగతా అన్ని పనులు చేస్తున్నారని, ఎస్సీలను చావ గొట్టుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరకు- చత్తీస్గఢ్ మధ్య గిరిజన పురుషుల పురుషాంగాలను కోస్తున్నారు. ఖనిజ సంపాదన దోచుకోవడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో ఒక ఓబీసీ మహిళను చెట్టుకు కట్టేసి కొట్టారు. మరో మైనార్టీ మహిళలను కూడా కొట్టారన్నారు. ఏడాది పాలనలో చంద్రబాబు చేసినది సున్నా అని ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది అన్నారు.

విశాఖ ఉక్కు గురించి కేంద్రాన్ని అడిగే ధైర్యం లేదు : ప్రధాని మోడీ విశాఖకు ఎన్నోసార్లు వచ్చి వెళ్లారు. ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయబోమని ఒక్క మాట చెప్పించలేకపోయారన్నారు. చంద్రబాబు నాయుడు బలహీనతకు ఇది నిదర్శనం. కేంద్రానికి మద్దతు ఇస్తూ, ఉక్కు ఫ్యాక్టరీ గురించి ధైర్యంగా అడగలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. నెలలోపు కేంద్ర క్యాబినెట్లో బిల్లు పెట్టి ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. విశాఖ ఈ స్థాయికి రావడానికి, స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమన్నారు.

అమరావతిని 23 జిల్లాల ప్రజలు ఇష్టపడడం లేదు : అమరావతిని 23 జిల్లాల ప్రజలు ఇష్టపడడం లేదని, ఉత్తరాంధ్ర ప్రజలు కూడా సంతోషంగా లేరన్నారు. శివరామకృష్ణన్ కమిషన్ దొనకొండలో రాజధాని పెట్టమని సలహా ఇస్తే అక్కడ రాజధాని పెట్టేందుకు చంద్రబాబు భయపడ్డారన్నారు. చంద్రబాబునాయుడుకు గుంటూరు జిల్లాలో బంధువులు ఎక్కువగా ఉన్నారు. కృష్ణా నది తీరంలో రాజధాని కట్టాలని ప్రయత్నిస్తున్నారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని చంద్రబాబు నాయుడు చెప్తున్నారని, నేనెళ్ళి చూస్తే నాకు అక్కడ దేవతలు కనిపించలేదన్నారు. ఇప్పటికే 30 వేల ఎకరాలు తీసుకున్నారు. ఇంకో 40 వేల ఎకరాలు కావాలని అంటున్నారన్నారు. ముఖ్యమంత్రి బంధువులు, మిత్రులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు అమరావతి చుట్టుపక్కల వందలాది ఎకరాల భూములు ఉన్నాయన్నారు. అమరావతి అవినీతి రాజధానని, 50 వేల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చి, గుంటూరు జిల్లాలోనే ఖర్చు చేస్తే, అప్పు భారం అన్ని జిల్లాల ప్రజలపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతికి నేను వ్యతిరేకం కాదు. కానీ అన్ని జిల్లాల ప్రజల మనోభావాలను గుర్తించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ తెచ్చి, వెంకయ్య నాయుడు, మరికొందరిని జైల్లో పెట్టిందని, పత్రికా స్వేచ్ఛ లేదని బిజెపి నాయకులు విమర్శిస్తున్నారు. ఎమర్జెన్సీ కాలం కంటే, ఇప్పుడు బిజెపి పాలనలో ప్రశ్నించిన ప్రతి గొంతును అణచివేస్తున్నారు. అరెస్టులు చేసి, జైల్లో పెడుతున్నారని ధ్వజమెత్తారు.

విశాఖ కాగ్నిజెంట్‌తో 8,000 మందికి ఉద్యోగాలు

విశాలాంధ్ర-విశాఖపట్నం : సాంకేతికత, వృత్తిపరమైన సేవలలో అగ్రగామిగా పేరు తెచ్చుకున్న కాగ్నిజెంట్ విశాఖపట్నంలో ఒక స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కాగ్నిజెంట్ డైరెక్టర్ రవికుమార్.ఎస్ మాట్లాడుతూ ప్రతిపాదిత కాగ్నిజెంట్ క్యాంపస్‌కి రాష్ట్ర ప్రభుత్వము కాపులుప్పాడ ఐటి హిల్స్‌లోని 22 ఎకరాలు కేటాయించిందన్నారు. రూ.1,583 కోట్ల పెట్టుబడితో ఈ క్యాంపస్ మూడు దశలలో అభివృద్ధి చేయబడుతుందన్నారు. ఇక్కడ 8వేల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని, ఇది ఏఐ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన క్లయింట్స్ కోసం డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ డెలివరీలో కాగ్నిజెంట్ ఆధునిక సామర్థ్యాలను పెంచుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన ప్రపంచ సంస్థలకు గమ్యస్థానముగా చేయాలనే తమ విజన్‌కు తగినట్లు ఈ క్యాంపస్ పనిచేయాలని ఐటి, ఎలెక్ట్రానిక్స్, & కమ్యూనికేషన్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేష్ తమకు సూచించినట్టు చెప్పారు. కాగ్నిజెంట్ ఉనికి, భవిష్యత్ శ్రామికశక్తికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పెంచుతూ ఈ ప్రాంతపు డిజిటల్ ఆర్థికవ్యవస్థ వేగవంతం చేస్తుందని అన్నారు. స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, వ్యాపారాన్ని సులభతరం చేయడం అభ్యుదయ పాలసీ సహకారం ద్వారా ఐటీ, ఐటీఈఎస్ రంగాలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించుటకు టాము కట్టుబడి ఉన్నామన్నారు. విశాఖపట్నంలో కాగ్నిజెంట్ 2029 ప్రారంభములో క్యాంపస్ యొక్క మొదటి దశ పూర్తి అయ్యే వరకు ఒక తాత్కాలిక సదుపాయము నుండి 800మంది అసోసియేట్స్ కొరకు సీటింగ్ సామర్థ్యముతో 2026 ప్రారంభము నుండి కార్యకలాపాలు ప్రారంభిస్తుందని అన్నారు.

క్యాన్సర్ విజేతల గాథతో అపోలో హాస్పిటల్స్ కెన్ విన్ కార్యక్రమం

విశాలాంధ్ర-విశాఖపట్నం : క్యాన్సర్ వ్యాధిని సమర్థవంతంగా ఎదుర్కోవ డానికి, రోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి అపోలో ఆసుపత్రి యాజమాన్యం' కెన్ విన్' పేరుతో ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈనెల క్యాన్సర్ విజేతల మాస ఉత్సవాన్ని (క్యాన్సర్ సర్వైవర్సు మంత్) పురస్కరించుకొని "చిరునవ్వుతో క్యాన్సర్ జయించాలి" అనే లక్ష్యంతో ' కెన్ విన్' గ్రూప్ బుధవారం ఆరిలోవ క్యాన్సర్ ఆస్పత్రి ప్రారంభించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అపోలో వైద్య బృందం మాట్లాడుతూ కేవలం వైద్యంతోనే కాకుండా క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్లో వ్యాధి పట్ల అవగాహన, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంతో రోగ నివారణ సులభతరం అవుతుందన్నారు. ఈ కారణంగా అపోలో క్యాన్సర్ వైద్య బృందం, క్యాన్సర్ వ్యాధిని జయించిన విజేతలతో కెన్ విన్ అనే వాట్సప్ గ్రూపును ప్రారంభించింది అన్నారు. ఈ గ్రూపులో చేరిన వారు క్యాన్సర్ వ్యాధి పట్ల ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు ఉచితంగా వైద్య సలహాలు, వైద్యులతో సంప్రదింపులు జరపడం,క్యాన్సర్ విజేతల అనుభవాలను తెలుసుకోవడం వీలు పడుతుందన్నారు. ఇంతవరకు ఎవరు ప్రారంభించిన ఈ వినూత్న కార్యక్రమాన్ని అపోలో ఆసుపత్రి ప్రారంభించడం హర్షదాయకమన్నారు. క్యాన్సర్ చికిత్సలో ఉన్నవారు, క్యాన్సర్ వ్యాధి పట్ల అనుమానితులు, క్యాన్సర్ వ్యాధి నుండి బయటపడిన వారు కూడా ఈ గ్రూపు ఉచితంగా చేరి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు అన్నారు. 'కెన్ విన్ అనే ఇంగ్లీష్ పదంలో'కెన్'పదం క్యాన్సర్ మొదట మూడు అక్షరాలను సూచిస్తుందని, అలాగే విన్ అనే పదం విజయాన్ని సూచిస్తుందని వైద్యులు వివరించారు. ఈ గ్రూపులో చేరాలనుకునేవారు క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా, నేరుగా ఆసుపత్రిని గాని, లేదా 0891-2727272, 0891-2867777 ఫోన్‌కి సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అపోలో క్యాన్సర్ ఆస్పత్రిలో వైద్యం పొంది క్యాన్సర్ జయించిన విజేతలు గాయత్రికృష్ణ, రామ్మోహన్‌రావు, సాత్విక్ రామ్ తమ అనుభవాలను వెల్లడించి, అపోలో ఆంకాలజీ వైద్యులు సేవలను కొనియాడారు. ఈ విలేకరుల కార్యక్రమంలో అపోలో క్యాన్సర్ ఆస్పత్రి ఆంకాలజీ వైద్యులు డాక్టర్ రాకేష్ రెడ్డి, డాక్టర్ వి ప్రదీప్, డాక్టర్ సుమన్ దాస్, యూనిట్ హెడ్ డాక్టర్ బ్రహ్మాజీనాయుడు మాట్లాడారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో ముచ్చర్ల

- సెల్ ఫోన్ సిగ్నల్ లేని గ్రామం
- ప్రజలకు నిత్యం ఇబ్బందులే
- మా గోడు వినండి ... ప్రభుత్వ అధికారులకు నాయకులకు విజ్ఞప్తి
- సెల్ టవర్ వెంటనే ఏర్పాటు చేయండి
- ఆవేదన వ్యక్తం చేస్తున్నా ప్రజలు

విశాలాంధ్ర-అనందపురం : మండలం ముచ్చర్ల గ్రామం ఇంకా వెనుకబడి ఉందని బలంగా తెలుస్తుంది. మండలంలో 26 పంచాయతీల్లో ఒకటైన ముచ్చర్ల గ్రామపంచాయతీలో ఇప్పటివరకు సెల్ఫోన్ సిగ్నల్ లేవంటే ఆ గ్రామం ఎంత ఏనుకబడి ఉందో చెప్పవచ్చు. నేటి కంప్యూటర్ యుగంలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో కూడా సెల్ సిగ్నల్ టవర్స్ ఉన్నప్పటికీ ఈ గ్రామంలో ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం, అయితే అనేకమార్లు అధికారులకి నాయకులకి గ్రామంలో సెల్ఫోన్ టవర్లు ఏర్పాటు చేయాలని చెప్పినప్పటికీ కూడా ఎటువంటి ప్రయోజనం లేదని తరచు సిగ్నల్ లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్ సరిగ్గా లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో, ఈ ప్రాంతాల్లో ముఖ్యంగాసిగ్నల్స్ లేక ప్రజలు పింఛన్లు, రేషన్ సరుకులు తీసుకోవడంలో, ఆధార్ కార్డులు పొందడంలో ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది ప్రజలు సిగ్నల్ కోసం కొండలు, గుట్టలు ఎక్కి దిగాల్సి వస్తోంది. మరికొందరు కిలోమీటర్ల దూరం నడిచి సిగ్నల్ ఉన్న ప్రదేశాలకు చేరుకుంటున్నారు. ఈ సమస్య దీర్ఘకాలంగా వేధిస్తున్నప్పటికీ, పరిష్కారం లభించడం లేదని ప్రజలు చచెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో సెల్ టవర్లు లేకపోవడం వల్ల సిగ్నల్స్ రావడం లేదు. దీని కారణంగా ప్రజలు తమ అవసరాలకు సెల్ ఫోన్ ఉపయోగించలేకపోతున్నారు. ముఖ్యంగా, అత్యవసర సమయాల్లో సిగ్నల్ లేకపోవడం ప్రాణాపాయానికి కూడా దారితీసే అవకాశాలు ఏర్పడుతున్నాయి.

ఇనామాం భూములు సమస్య పరిష్కరించండి : ముచ్చర్ల గ్రామంలో ఉన్నవన్నీ కూడా ఇనాం భూములే, రైతులు తమ భూములను క్రయవిక్రయాలు చేసుకొనే అవకాశం లేక తరచూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆడపిల్లల తండ్రులు పిల్లలకి పెళ్లి చేసుకుందామని భూములు అమ్మకానికి పెడదామన్న ముందుకు వచ్చి కొనే నాథుడే కరువయ్యాడని నువ్వు ఆపోతున్నారు ప్రస్తుతం ఉన్న భూముల్లో వ్యవసాయం చేసుకోవడానికి మాత్రమే కొండ ప్రాంతం కాబట్టి కొంతమేర ఉపయోగపడుతుందని, కానీ అవసరాల కోసం అమ్మకాలు చేద్దామంటే అవకాశం లేకుండా పోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. చుట్టూ కొండలు ఆహ్లాదకరమైన వాతావరణం తప్ప అభివృద్ధి మాత్రం శూన్యం అభివృద్ధికి ఇంకా ఆమరణ దూరంలో ఉందని చెప్పడానికి ఇవే సాక్ష్యాలు. ఏళ్ల నాటి ఈ ఇనాం భూములు సమస్యను వెంటనే ప్రభుత్వం పరిష్కరించి ఒక దారి చూపించాలని, అలాగే గ్రామంలో సెల్ఫోన్ టవర్లు ఏర్పాటు చేయాలని, జనసేన నాయకులు లెంక శంకర్ దానికి ప్రజలు నాయకులు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి

స్వచ్ఛ సర్వేక్షణ కోసం వర్క్‌షాప్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ 2025లో భాగంగా, విశాఖపట్నము జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈరోజు ఒక ముఖ్యమైన వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా పరిషత్ ఛైర్మన్ పి. నారాయణ మూర్తి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి యం.వి. శ్రీనివాసరావు, జిల్లా పంచాయితీ అధికారి, రూరల్ వాటర్ సప్లై అండ్ శానిటేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వి.వి. చౌదరి పర్యవేక్షణలో జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో, స్వచ్ఛ సర్వేక్షణ బృందాలు గ్రామాలలో ఏమి పరిశీలిస్తాయి, ఏ కేటగిరీకి ఎన్ని మార్కులు కేటాయిస్తారు అనే విషయాలను వివరించారు. గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుపరచడం ద్వారా స్వచ్ఛ సర్వేక్షణలో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించేలా అందరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఏఈ ఆర్‌డబ్ల్యుఎస్, మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. జిల్లాను పరిశుభ్రంగా ఉంచడానికి మరియు స్వచ్ఛ సర్వేక్షణలో అగ్రస్థానంలో నిలబెట్టడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు.

సమిష్టి కృషితోనే వర్సిటీ అభివృద్ధి

- వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: అందరి సమిష్టి కృషితో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తున్నట్టు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో 18వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్ఠను పెంచేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. వర్సిటీలో రూసా నిధులు రూ.20 కోట్లతో పనులు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంలో వర్సిటీ కీలక భూమి పోషిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, వర్సిటీలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం. అనూరాధ, డాక్టర్ సీహెచ్. రాజశేఖరరావు, పాలకమండలి సభ్యుడు డాక్టర్ కె. చత్రపతి, ఎన్సో డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ ఆహారంలో మార్పులతో కొలెస్ట్రాల్ నియంత్రణ

మాక్స్ హెల్త్‌కేర్‌లో డైటెటిక్స్ రీజినల్ హెడ్ రితికా సమద్దర్

విశాలాంధ్ర-విశాఖపట్నం : గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులను నివారించడానికి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం అత్యంత కీలకం అని, రోజువారి ఆహారంలో మార్పులతో కొలెస్ట్రాల్‌ను నియంత్రించుకోవచ్చని డయటిక్స్ రీజినల్ హెడ్ రితికా సమద్దర్ అన్నారు. జీవనశైలి ఆహారం మార్పులు అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సు ఆమె మాట్లాడుతూ కొలెస్ట్రాల్ ను సమర్థవంతంగా నిర్వహించడానికి, సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం అన్నారు. బాదం, ఓట్స్, తృణధాన్యాలు, పండ్లు మరియు కూరగాయలు వంటి ఆహారాలను డైట్ లో చేర్చుకోవడం కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడం వీలవుతుందన్నారు. ఆహారంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం అని, పోషకాలు కలిగిన బాదం తరహా ఆహారాలు తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాల్సిన, ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడంలో సహాయపడే ఆహారాలైన వాటిలో బాదం చాలా ముఖ్యం అన్నారు. పోషకాల గని, బాదం అని, ఇందులో ప్రోటీన్, మెగ్నీషియం, కాల్షియం , జింక్ వంటి 15 ముఖ్యమైన పోషకాలు ఉన్నాయన్నారు. ఆహారంలో బాదంను చేర్చుకోవడం వల్ల గుండెకు హాని కలిగించే వాపు తగ్గించటంతో పాటుగా మొత్తం మరియు ఎల్ డీ ఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుందని చెప్పారు. దీంతోపాటు తృణధాన్యాలు ఓట్స్, పండ్లు, వెల్లుల్లి తీసుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు.

ఆకర్షణీయంగా మారిన మనీ మార్కెట్ ఫండ్లు : టాటా ఏఎంసి

విశాలాంధ్ర-విశాఖపట్నం : వడ్డీ రేట్లు తగ్గుతున్న క్రమంలో, రాబడి, భద్రత మరియు లిక్విడిటీ (ద్రవ్యత)ను సమతుల్యం చేసుకోవాలనుకునే పెట్టుబడిదారులకు మనీ మార్కెట్ ఫండ్లు ఆకర్షణీయమైన ఎంపికగా మారుతున్నాయి. స్వల్పకాలిక , అధిక-నాణ్యత గల హోల్డింగ్‌లకు పేరుగాంచిన ఈ నిధులు, తగ్గుతున్న వడ్డీ రేటు వాతావరణంలో ప్రయోజనం పొందేందుకు తోడ్పడనున్నాయి. నెల ప్రారంభంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తన ద్రవ్య పరపతి విధాన సమీక్షలో భాగంగా వడ్డీ రేట్ల సడలింపును ప్రకటించింది, రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.5 శాతం కి తగ్గించింది. ఆశ్చర్యకరమైన చర్యగా, ద్రవ్యతను పెంచడానికి మరియు క్రెడిట్ వృద్ధిని ప్రేరేపించడానికి ఇది నగదు నిల్వ నిష్పత్తిని 100 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ప్రతిస్పందనగా డిపాజిట్ రేట్లు కూడా క్షీణించటంతో, స్వల్పకాలిక మిగులు నగదును నిల్వ చేయడానికి మనీ మార్కెట్ ఫండ్‌లు సాంప్రదాయ ఫిక్స్ డిపాజిట్లకు ప్రత్యామ్నాయాన్ని అందిస్తున్నాయి. "మనం ఫ్రంట్ లోడెడ్ పాలసీ సడలింపు దశలోకి అడుగుపెడుతున్నందున, మనీ మార్కెట్ ఫండ్‌లు పెట్టుబడిదారులకు ఒక స్మార్ట్ కేటాయింపు ఎంపికను అందిస్తున్నాయి. రెపో రేటు ఇప్పుడు 5.5 శాతం వద్ద ఉండటంతో, పెట్టుబడిదారులు మనీ మార్కెట్ ఫండ్‌లలో రెపో కంటే అదనంగా 50-75 బేసిస్ పాయింట్లను సంపాదించవచ్చు, అదే సమయంలో లిక్విడిటీని కొనసాగిస్తూ, అనిశ్చితిని పరిమితం చేసుకోవచ్చు "అని టాటా అసెట్ మేనేజ్‌మెంట్, ఫిక్సడ్ అసెట్ డిప్యూటీ హెడ్ అమిత్ సోమానీ అన్నారు. మనీ మార్కెట్ ఫండ్‌లు ట్రెజరీ బిల్లులు, వాణిజ్య పత్రాలు మరియు డిపాజిట్ సర్టిఫికెట్లు వంటి సాధనాలలో పెట్టుబడి పెడతాయి, ఇవి స్థిరత్వం మరియు రాబడి మధ్య సమతుల్యతను అందిస్తాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా వెల్లడించే దాని ప్రకారం, ఈ విభాగం ఏప్రిల్ మరియు మే 2025లో రూ. 42,730 కోట్ల సంచిత నగదు ప్రవాహాన్ని అందుకుంది. ఈ ధోరణిని ప్రతిబింబిస్తూ, టాటా మనీ మార్కెట్ ఫండ్ గత రెండు నెలల్లో విశాఖపట్నం నుండి రూ. 23 కోట్ల నగదు ప్రవాహాన్ని నమోదు చేసింది. ఇది ఆర్థిక సంవత్సరం 2024లో రూ. 36.30 కోట్ల నుండి ఆర్థిక సంవత్సరం 2025లో రూ. 130.2 కోట్లకు పెరిగింది, ఇది ఫండ్ నిర్వహణలో ఉన్న ఆస్తులలో రూ. 30,000 కోట్ల మైలురాయికి దోహదపడింది. టాటా మనీ మార్కెట్ ఫండ్ యొక్క పనితీరు క్రమశిక్షణ వ్యవధి నిర్వహణ మరియు అధిక-క్రెడిట్ నాణ్యత జారీదారులపై దృష్టి పెట్టడంపై ఆధారపడి ఉంటుంది.

రథయాత్ర సందర్భంగా నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

విశాలాంధ్ర-విశాఖ క్రైమ్ : జగన్నాథ రథయాత్ర సందర్భంగా విశాఖపట్నంలో ట్రాఫిక్ మళ్లింపుపై పోలీసులు ప్రకటన విడుదల చేశారు. జగన్నాథ రథయాత్ర (జూన్ 27న) సందర్భంగా , నగరంలో భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

ప్రధాన వివరాలు: రథయాత్ర కొనసాగినప్పుడు జగదాంబ జంక్షన్ నుండి పాత పోస్ట్ ఆఫీస్ వైపు వచ్చే వాహనాలన్నీ చౌల్ట్రీ వద్ద కుడివైపుకు తిరిగి డాల్ఫిన్ జంక్షన్, ఆర్కే జంక్షన్, చిలకల జంక్షన్, గోపాల్ ఆటో జంక్షన్ మీదుగా పాత పోస్ట్ ఆఫీస్ చేరుకొనవలెను. కలెక్టర్ ఆఫీస్, జిల్లాపరిషిత్ మరియు ఆర్. కే బీచ్ నుండి గాజువాక వైపు (99) వెళ్లే బస్సులు వాచ్ హౌస్ జంక్షన్,జగదాంబ జంక్షన్, చిత్రాలయ రోడ్, లీలామహల్ జంక్షన్, డాల్ఫిన్ జంక్షన్ మీదిగా వెళ్లవలెను. సుమారు 5000 మంది ఇస్కాన్ భక్తులు జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ బొమ్మ వద్దకు చేరుకొని అక్కడ నుండి ఎస్‌బిఐసి బిల్డింగ్, అంబేద్కర్ సర్కిల్, దాబా గార్డెన్, జగదాంబ జంక్షన్, సెవెన్ హిల్స్, పటేల్ జంక్షన్ మీదుగా గురజాడ కళాక్షేత్రంనకు చేరుకుంటారు. రథయాత్ర కొనసాగినప్పుడు ఆర్.ట్. సి కాంప్లెక్స్ నుండి పూర్ణ మార్కెట్ పోవు బస్సులను ట్రాఫిక్ అంతరాయం కలగకుండా గొల్లలపాలెం జంక్షన్, అంబెద్కర్ జంక్షన్, అల్లిపురం, హరిత జంక్షన్, కులాసా బార్, బౌదార రోడ్, ఆర్కే జంక్షన్, చిలకల జంక్షన్, గోపాల్ ఆటో జంక్షన్ మీదుగా పాత పోస్ట్ ఆఫీస్ చేరుకొనవలెను, సుమారు 3000 మంది భక్తులు జగదాంబ జంక్షన్ నుండి బయలుదేరి దాబా గార్డెన్ మీదుగా అంబేద్కర్ సర్కిల్, ఎస్‌బిసి బిల్డింగ్, గుడివాడ గురునాధరావు విగ్రహం జంక్షన్ మీదుగా జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ బొమ్మ జంక్షన్కు చేరుకుంటారు. ఆర్.ట్. సి కాంప్లెక్స్ నుండి కలెక్టర్ ఆఫీస్, జిల్లాపరిషిత్ మరియు ఆర్.కే. బీచ్ కు పోవు బస్సులను గొల్లలపాలెం జంక్షన్, సెవెన్ హిల్స్ జంక్షన్, గ్రీన్ పార్క్, వార్త రోడ్, తెన్నేటి జంక్షన్, జగదాంబ జంక్షన్ మీదుగా వెళ్లవలెను. సుమారు 3000 మంది భక్తులు జగదాంబ జంక్షన్ నుండి బయలుదేరి వార్తా రోడ్డు, సెవెన్ హిల్స్, పటేల్ జంక్షన్ మీదుగా గురజాడ కళా క్షేత్రం నకు చేరుకుంటారు. రథయాత్ర కొనసాగినప్పుడు జగదాంబ జంక్షన్, సెవెన్ హిల్స్ జంక్షన్ వద్ద డైవర్‌ఇ వ్వబడును. ఆర్ కే బీచ్ నుండి జిల్లపరిషిత్ కు శ్రీ జగన్నాథ స్వామి రథం వచ్చు సమయము లో అవసరం మేరకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బస్సులను కలెక్టర్ ఆఫీస్ వద్దనే అవి తిరిగి వెనకకు పంపించబడును. సుమారు 5000 మంది భక్తులు బయలుదేరి సి. ఆర్ రెడ్డి సర్కిల్, చిన్న వాల్తేరు, పార్క్ హోటల్ జంక్షన్ మీదుగా లైసెన్సు కాలనీ వద్దకు చేరుకుంటారు. దస్పల్ల హిల్స్ రథయాత్ర కొనసాగినప్పుడు. సి ఆర్ రెడ్డి సర్కిల్, వద్ద డైవర్షన్ ఇవ్వబడుతుంది. సుమారు 500 మంది భక్తులు ఏఎస్ రాజా సర్కిల్ నుండి బయలుదేరి టిటిడి సర్కిల్, ఎంవిపి డబల్ రోడ్డు, వెంకోజీ పాలెం, క్యాన్సర్ హాస్పిటల్, వాసువాని పాలెం మీదుగా ఏఎస్ రాజా కాలేజ్ దగ్గరకు చేరుకుంటారు. సుమారు 15 వేల మంది భక్తులు ఏ ఎస్ టెంపుల్ శనివాడ జంక్షన్ నుండి బయలుదేరి హైవే మీదుగా అగనంపూడి గ్రామమునకు చేరుకొనును.అగనంపూడి రథయాత్ర కొనసాగినప్పుడు శివాలయం జంక్షన్ వద్ద డైవర్షన్ ఇవ్వబడుతుంది. సుమారు 5000 మంది భక్తులు ఉక్కు నగరం లోపల రథయాత్ర నిర్వహిస్తారు. సుమారు 2000 మంది భక్తులు %ఎదీ% కాలనీ నుండి బయలుదేరి రైతు బజార్ జంక్షన్ నుండి గవర్నమెంట్ హాస్పిటల్ జంక్షన్, నెల్లిముక్కు జంక్షన్ పాత అయ్యన్నపాలెం మీదుగా పెద్ద కోరాడ, పెంటమాంబా టెంపుల్ మీదుగా మరల హెచ్ కాలనీ కి చేరుకుంటారు. రథయాత్రలకు మరియు రహదారులలో ప్రయాణించే సాధారణ వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను రథయాత్ర కొనసాగే మార్గంలో పోలీస్ వారు డైవర్షన్స్ ఇవ్వడం జరుగుతుంది. పోలీసు వారు ఇచ్చే డైవర్షన్ గమనించి ప్రయాణించ వలసిందిగా తెలియజేస్తున్నాం. అలాగే రథయాత్ర కొనసాగే సమయంలో సాధారణ వాహనదారులు రథయాత్ర కొనసాగే మార్గంలో కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోని పోలీసు వార్కి సహకరించవలయును పోలీసులు ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసేందుకు, మరియు రథయాత్ర సున్నితంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

కేసు బోయిన త్రినాథ్ కుట్ర రాజకీయాలు

నీటి పల్లి రమేష్, గల్ల అప్పలరాజు

విశాలాంధ్ర-పెందుర్తి : మండలంలోని పెదగాడి గ్రామంలో రాజకీయాలు రంజుగా సాగుతున్నాయి. ఆ గ్రామ సర్పంచ్ కేసు బోయిన లావణ్య భర్త త్రినాథ్ తనపై నీటిపల్లి రమేష్, గళ్ళ అప్పలరాజు అనే వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు మీడియాకు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే త్రినాథ్ ఆరోపణలను నీటి పల్లి రమేష్, గల్ల అప్పల రాజులు బుధవారం సాయంత్రం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నీటిపల్లి రమేష్ మాట్లాడుతూ మంగళవారం తాను కారులో గ్రామానికి వచ్చి వెంటనే అర్జెంటు పనిపై బయటకు వెళ్లిపోయానని అలాంటి తాను త్రినాథ్ పై దాడి చేసి గాయపరిచానంటూ ఫిర్యాదు చేయడం అతని కుట్ర రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. ఓ పత్రిక యజమానిగా గత వైసీపీ ప్రభుత్వంలో త్రినాథ్ సాగించిన అనేక అక్రమాలను వెలికి తీసానన్న అక్కసుతో తనపై తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు గ్రామంలోని ఓ లేఔట్ లో ప్లాట్లను దఫ దఫాలుగా పలువురికి విక్రయించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. త్వరలో అన్ని ఆధారాలను బయటపెడతానని వెల్లడించారు. గల్ల అప్పలరాజు మాట్లాడుతూ పెదగాడి గ్రామంలో మాకు రెండు ఎకరాలు వ్యవసాయభూమి ఉందని అందులో తాము సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆ భూమి తనదంటూ కొందరు వ్యక్తులు తమపై దాడికి పాల్పడుతున్నారని విమర్శించారు. దీనిపై హైకోర్టులో దావా వేసి ఆర్డర్ తెచ్చుకున్నామని వెల్లడించారు. తన తప్పులు బయటికి వస్తాయన్న భయంతో కేసుబోయిన త్రినాథ్ తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. గతంలో త్రినాథ్ అతని అనుచరులు తమపై దాడి చేయగా పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు. పోలీసుల విచారణలో అన్ని విషయాలు బయటకు వస్తాయని త్రినాథ్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఎవరు నమ్మవద్దని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి బదిలీలు చేపట్టండి

విశాలాంధ్ర-మెలియాపుట్టి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించిన తదుపరి బదిలీల ప్రక్రియ చేపట్టాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది బుధవారం నాడు బదిలీల ప్రక్రియకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల రేషనలైజేసన్ జి.ఓ. నెం.5 వల్ల వలన సచివాలయ ఉద్యోగులు సొంత మండలాల, మునిసిపాలిటిలకు బదిలీలు చేయరాదన్న నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులకు చాలా ఇబ్బందిగా మారిందని, ఈ జి.ఓ. పునః పరిశీలించి సొంత మండలాలు, మునిసిపాలిటీలలో పోస్టింగ్స్ ఇచ్చే విధముగా మార్పు చేయాలని, రేషనలైజేసన్ ప్రక్రియ పూర్తి చేసిన తరువాతనే బదిలీలు చేపట్టాలని, రేషనలైజేసన్ పూర్తి అయిన తరువాత మిగులు ఉద్యోగులను ఎక్కడ నియమిస్తారో స్పష్టత ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, సచివాలయ ఉద్యోగులందరికి ప్రమోషన్ చానల్ కల్పించి రేషనలైజేసన్ ప్రక్రియ చేపట్టాలని, జాయినింగ్ తేదీ నుండి సర్వీసును పరిగణనలోకి తీసుకొని రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ఆలస్యంగా ప్రొబిషన్ ప్రకటించినందుకు 9 నెలలు కాలానికి గాను ఏరియర్స్ మంజూరు చేయాలని గ్రామ వార్డు సచివాలయాలలో పనిచేయుచున్న వారికి సొంత మండలంలో పనిచేసుకునే వెసులుబాటు కల్పించాలని, వెబ్ కౌన్సిలింగ్ ద్వారా మాత్రమే బదిలీలు ప్రక్రియ పారదర్శకంగా జరపాలని, సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, స్పష్టమైన జాబ్ చార్ట్ అమలు, సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపు, అర్హులైన వారికి ప్రమోషన్లు వంటి డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని వివిధ డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని తహసిల్దార్ పాపారావు, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండాలకు అందించారు. తహసిల్దార్ ఎంపీడీవోలకు కలిసిన వారిలో గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది శరత్ కుమార్ రెడ్డి, రాజారావు మోహన్ కృష్ణ, ద్రోణాచార్యులు, ప్రణీత్ కుమార్, సుజాత, దమయంతి, దుర్గారావు, సిబ్బంది తదితరులున్నారు.

ఘనంగా గ్రామ దేవతల సంబర మహోత్సవాలు

ఆంజనేయపురం గ్రామంలో మూడు రోజులపాటు పండగ వాతావరణం

విశాలాంధ్ర-టెక్కలి : మండలంలోని ఎ ా ని క ఆంజనేయపురం గ్రామంలో మూడు రోజులపాటు శ్రీశ్రీశ్రీ పాలపోలమ్మ తల్లి, పాతపట్నం అమ్మ తల్లి గ్రామదేవతల సంబర మహోత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా జరిగాయి. గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు గ్రామ దేవతల సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదటి రోజు దేవర తెచ్చుట నుండి గ్రామంలో ప్రతి ఇంటింటా పండగ వాతావరణం మొదలైంది. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొరాటాలతో చల్లదనాన్ని చేసుకున్నారు. మూడు రోజులు పాటు వివిధ కార్యక్రమాలతో అమ్మవారు ఘటంలతో ఊరేగింపు కార్యక్రమాలు జరిపారు. అనంతరం అమ్మవారికి మొక్కులను చెల్లించుకుని తన కుటుంబ సభ్యులకు విందు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సంబరాలకు వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో బంధువులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.